క్లుప్తంగా

సన్మానం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకోదండసీతారామస్వామి ఆలయాన్ని నిర్మించి, ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ ధర్మకర్త, సర్పంచ్ గార రమణను ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం ఘనంగా సత్కరించారు. కేవలం రెండున్నరేళ్లలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేదపండితులు, ప్రముఖ ఆధ్యాత్మికవక్తలను తీసుకువచ్చి, ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారని గ్రామపెద్దలు ప్రశంసించారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

రాజాం: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన బయలాజికల్ సైన్స్ పరీక్షకు 1738 మందికి గాను 1682 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో యాగాటి దుర్గారావు తెలిపారు. అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు.

లక్ష్మీపురంలో ఆధ్యాత్మిక శోభ


పూజల్లో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో విజయదుర్గ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన చాలామంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేయడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఖండ్యాం గ్రామానికి చెందిన అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అంపోలు రామప్రసాద్ శర్మ, వేమకోటి అజయ్‌శర్మ, ఆరవెల్లి ప్రసాద్‌శాస్త్రి, రవిశాస్త్రిల పర్యవేక్షణలో తొలిరోజు వినాయక పూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్యమార్జన, దీక్షాధారణ, అఖండ దీపారాధన, కుండమండప సంస్కారం, ఆవాహనాలు, తిరువీధి, జలాధివాసం, అంకురార్పణ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి


జగన్నాథపురంలో ఎన్నికల నిబంధనల అమలును పరిశీలిస్తున్న ఎంసీసీ బృంద సభ్యులు

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండలంలోని జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఎంసీసీ బృందం మంగళవారం పర్యటించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. ఎక్కడైనా రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, స్టిక్కర్లు ఉండిపోతే వాటిని వెంటనే తీసివేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సంతకవిటి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ షేక్ శంకర్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేశారు. వాహనదారుల లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ఎన్నికల వేళ పరిమితికి మించి మద్యం, డబ్బు రవాణా జరగకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

వివాదాలకు పాల్పడితే క్రిమినల్ కేసు

వంగర: ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా వివాదాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ హెచ్చరించారు. మండలంలోని జగన్నాథవలస, మగ్గూరు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన గ్రామస్తులతో సమావేశమై, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. అందరూ సోదరభావంతో మెలగాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు.

రుణాల రికవరీ శతశాతం చేయాలి

వంగర: మహిళా స్వయంశక్తి సంఘాలకు అందజేసిన రుణాలను ఈ నెలాఖరు నాటికి శతశాతం రికవరీ చేయాలని ఏపీఎం మీసాల చక్రపాణి సూచించారు. మంగళవారం మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఆయన వెలుగు ద్వారా తీసుకున్న హెచ్‌డీఐఎఫ్, సీఐఎఫ్, ఉన్నతి, ఎస్‌టీఈపీ, స్త్రీనిధి వంటి రుణాలను సకాలంలో చెల్లించాలని తెలిపారు. పెండింగ్‌లోని ఉన్నతి రుణాల రికవరీ శాతం కూడా పెంచాలన్నారు.

మళ్లీ అవకాశం ఇవ్వండి..

మరింత అభివృద్ధి చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పక్కనే ఎమ్మెల్యే శంబంగి

- విజయనగరం ఎంపీ అభ్యర్థిని ఖరారు చేసుకోలేని దయనీయ స్థితిలో టీడీపీ
- చీపురుపల్లిలో మంత్రి బొత్సపై పోటీకి భయపడుతున్న కూటమి అభ్యర్థులు
- యువ సమ్మేళనంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీగా తనకు, బొబ్బిలి ఎమ్మెల్యేగా శంబంగి వెంకటచినఅప్పలనాయుడుకు మరోసారి అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బూసాయవలస కళ్యాణ మండపంలో యువ సమ్మేళనం పేరిట మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కాగా, ఇదే సమావేశానికి హాజరైన యువత జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలు చేస్తూ ఈలలు వేస్తూ ఉత్సాహం కనబరిచారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ యువతలోని ఉత్సాహం చూస్తుంటే కూటమి పార్టీలు గల్లంతవ్వడం ఖాయమనిపిస్తోందన్నారు. విజయనగరం ఎంపీ అభ్యర్థిని ఇప్పటికీ ఖరారు చేసుకోలేని దయనీయ స్థితిలో టీడీపీ ఉందంటే కూటమి బలం పరిస్థితి ఎలా ఉందో ప్రజలు, యువత గమనించాలన్నారు. అలాగే చీపురపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీకి కూటమి అభ్యర్థులు భయపడుతున్నారన్నారు. సామాన్యుడి సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయని వారికి కూడా రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేశారన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను నమ్మవద్దని, సీఎం జగన్‌పై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో 175కి 175 ఎమ్మెల్యే సీట్లు, 25కి 25 ఎంపీ సీట్లు గెలిచి, వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రాజులను నమ్మి మోసపోవద్దు..

నియోజకవర్గంలో రాజులను నమ్మి, రాచరిక పాలనకు అవకాశం ఇచ్చి మోసపోవద్దని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. నియోజకవర్గం మొత్తంలో ఒకే ఒక్క కుటుంబం ఉన్న రాజులు 90 శాతం ఉన్న బీసీలపై పోటీ చేసి గెలిచే సాహసం చేస్తున్నారన్నారు. ఆ మండలంలో మెజార్టీ ఉంది, ఈ మండలంలో మెజార్టీ అత్యధికంగా వస్తుందని మైండ్ గేమ్ ఆడుతున్నారు తప్ప ఎక్కడా ఏమీ లేదని, వారి మాయ మాటలు నమ్మవద్దన్నారు. రాజులకు ఓటు వేసి చేతులు కట్టుకుని గేటు దగ్గర నిలబడతారో, రైతు బిడ్డకు ఓటు వేసి సమస్యల పరిష్కారానికి నేరుగా నా ఇంట్లోకి వస్తారో ప్రజలే ఆలోచన చేయాలన్నారు. ఇక్కడ యువత ఉత్సాహం, గ్రామాల్లో ప్రజాదరణ చూస్తుంటే 15 వేల మెజార్టీతో గెలిచి తీరుతానన్న నమ్మకం నాకుందన్నారు.

రైతుబిడ్డ గెలుపే మా లక్ష్యం..

రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోని బలహీన వర్గాలకు చెందిన రైతుబిడ్డ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గెలిపించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే మా లక్ష్యమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ మళ్లీ సీఎం జగనన్నను ఓటు ద్వారా ఆశీర్వదించాలన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో 2019 ఫలితాలే పునరావృతం చేసేందుకు యువతంతా సిద్ధంగా ఉన్నామని యువనాయకుడు మజ్జి బాలకృష్ణ అన్నారు. బొబ్బిలి గడ్డపై బీసీ నేతను గెలుపించుకోవాల్సిన అవసరం ఉందని, బీసీలంతా ఏకమవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బెల్లాన చంద్రశేఖర్, పెంకి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పక్కనే ఎమ్మెల్యే శంబంగి

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


సంతకవిటి: గారన్నాయుడుపేటలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కనే రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఇంటింటా ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చిత్తారిపురం, హొంజరాం, తమరాం, వాసుదేవపట్నం, గారన్నాయుడుపేట, గుజ్జన్నపేట, పోడలి, బూరాడపేట, మేడమిర్తి, రంగారాయపురం, పోతులజగ్గుపేట గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయా నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఓ వైపు సచివాలయ వ్యవస్థ, మరోవైపు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలు అందించడమూ జరిగిందన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ తమ అమూల్యమైన ఓటు ఫ్యాన్ గుర్తుపై వేసి, మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ సిరిపురపు మంజు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీటీసీలు సిరిపురపు హరిబాబు, మొయ్యి మోహన్‌రావు, పప్పల గనపతిరావు, ఆడంగి గౌరినాయుడు, మొయ్యి జయసుధ, పొన్నాడ సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లి పైడితల్లి మారుజాతర


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి మారుజాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజుల క్రితం ఇక్కడి జాతరను అత్యంత వైభవంగా జరపగా, అప్పుడు అమ్మవారిని దర్శించుకోలేని భక్తులు మంగళవారం అధిక సంఖ్యలో హాజరై, దర్శనం చేసుకున్నారు. 20 వేల మంది వరకు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మారుజాతరకు భక్తులు అధిక సంఖ్యలో రాగా, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఈవో బి.వి.మాధవరావు, ఆలయ కమిటీ సభ్యులు సలాది తులసీదాస్, గంది గోపి, పి.చైతన్య, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రంలోని వసతులు పరిశీలిస్తున్న ఈఆర్‌వో జోసెఫ్

రాజాం: మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను రాజాం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్‌వో) ఎల్.జోసెఫ్ మంగళవారం పరిశీలించారు. ఓటు వేసేందుకు కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కేంద్రాల్లో కల్పించాలని ఆయన తెలిపారు. రెండు ద్వార బంధాలున్న గదులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని, కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎప్పటికప్పుడు బూత్ లెవల్ అధికారులు ఎన్నికల అధికారులకు అందుబాటులో ఉండాలని, ఎన్నికల ప్రచారాల వివరాలు, కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎస్.కృష్ణంరాజు, డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


తారాపురంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

రామభద్రపురం: మండలంలోని తారాపురం, బూసాయవలస, ముచ్చర్లవలస తదితర సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు మంగళవారం ఫ్లాగ్‌మార్చ్(కవాతు ప్రదర్శన) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించేందుకు సిబ్బందిని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో ధైర్యగా ఓటు వేసేలా ఓటర్లకు భరోసా కల్పిస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన


పిల్లలతో చదివించి, అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: మండలంలోని పొనుగుటివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో యాగాటి దుర్గారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులతో పాటు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని, ప్రతిరోజూ లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశ బోధన జరగాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వంగర: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని రేగిడి ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అరసాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల-1ను మంగళవారం సందర్శించిన ఆయన ఆర్‌జేడీ ఆదేశాల మేరకు పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వివిధ ప్రశ్నలు అడిగి పరిశీలించారు. తర్ల్ ప్రోగ్రాం పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతిరోజూ లెర్న్ ఏ వర్డ్ అమలు చేయాలని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కించపరిస్తే సహించేది లేదు

- రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



రాజాం: కోవిడ్ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడి, ప్రతీ గ్రామానికి రక్షణ కవచంలా నిలిచిన గ్రామ, వార్డు వలంటీర్లను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణంలోని ఆయన నివాసంలో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన టీడీపీ నేత ఒకరు వలంటీర్లను టెర్రరిస్టులుగా వర్ణిస్తూ మాట్లాడారని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్లపై తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజాగ్రహానికి గురవుతారని, అటువంటి పనులు మానుకోవాలని హితవుపలికారు.

మాజీ ఎంపీటీసీ మృతి

బొబ్బిలి: మండలంలోని కొండదేవుపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోడి మహాలక్ష్మి(55) మంగళవారం మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితర నాయకులు కలిసి ఆ గ్రామం వెళ్లి, ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఘనంగా పైడితల్లి వారాల పండగ


అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులు

తెర్లాం: గ్రామదేవత శ్రీపైడితల్లి వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గతంలో ఏటా పైడితల్లి, హేమాలమ్మ వారి పండగలను గ్రామస్తులు చేసేవారు. గత కొన్నేళ్లుగా పైడితల్లి అమ్మవారి పండగను ఐదేళ్లకోసారి మాత్రమే చేసేలా గ్రామపెద్దలు తీర్మానం చేశారు. దీంతో ఏటా అమ్మవార్లకు వారాల పండగను నిర్వహిస్తున్నారు. ఈ పండగలో భాగంగా ఉదయం అమ్మవారి ఘటాలను పూజారి ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా పూజారి కుటుంబ సభ్యులు ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


బాడంగి: మండల కేంద్రంలో పరదేశమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా చేశారు. అమ్మవారి మట్టి ఘటాన్ని గద్దెలో నుంచి బయటకు తీసి, గ్రామంలోని ప్రధాన వీధిలో ఊరేగించారు. ఈ క్రమంలో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

రుచి, శుచి తప్పనిసరి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎంఈవో-2 బొత్స ఎరకయ్య సూచించారు. మండలంలోని అంబాడ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని ఆయా సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మీసాల సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిజిటల్ అసిస్టెంట్ మృతి


మృతుడు ఉప్పాడ శ్రీకాంత్

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉప్పాడ శ్రీకాంత్(29) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఉద్దవోలుకు చెందిన శ్రీకాంత్ మంగళవారం ఉదయం సుందరాడ సచివాలయానికి విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్న భోజనం సమయంలో భోజనం చేసి వస్తానని సహచర ఉద్యోగులకు చెప్పి భోజనానికి వెళ్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై, అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన సహోద్యోగులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజాం ఆస్పత్రికి అతడిని తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. సచివాలయంలో అంతవరకు విధి నిర్వహణలో తమతో పాటు సరదాగా గడిపి, భోజనం చేసి వస్తానని చెప్పి వెళ్లిన శ్రీకాంత అకాల మరణానికి గురికావడం చూసి తోటి ఉద్యోగులు కంటతడి పెట్టుకున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీకాంత్ మృతి పట్ల ఎంపీడీవో, సుందరాడ సచివాలయ ఉద్యోగులు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.


శ్రీకాంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి పద్మ, కుటుంబ సభ్యులు

ఆస్తిపన్ను వసూలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తిపన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని తెలిపారు. ఎక్కడెక్కడ తక్కువ వసూళ్లు ఉన్నాయో వాటిపై దృష్టి సారించాలని, కంచరవీధి, పూల్‌భాగ్, కుమ్మరి వీధి, రావువారి వీధి, మల్లమ్మపేట సచివాలయాల పరిధిలోని సిబ్బంది త్వరగా ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడి, పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరుసగా సెలవు రోజులున్నా చెల్లింపుల కౌంటర్ తెరిచే ఉంటుందన్న విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు.

సమావేశంలో ఆర్‌వో ప్రసాదరావు, టీపీఆర్‌వో జగన్మోహనరావు, టీపీవో వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం

- పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఈఆర్‌వో సాయిశ్రీ

రామభద్రపురం: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యమని ఈఆర్‌వో సాయిశ్రీ అన్నారు. మండలంలోని కొట్టక్కి, తారాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులను తప్పనిసరిగా కల్పించాలని, ఆ బాధ్యతను బీఎల్‌వోలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల ద్వారా ఓటు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు తొలిసారిగా ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ సులోచనరాణి తదితరులు ఉన్నారు.


రామభద్రపురం: కొట్టక్కిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌వో సాయిశ్రీ

బొబ్బిలి: స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డీవో, ఈఆర్‌వో ఎ.సాయిశ్రీ మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని తెలిపారు. ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని అతి సమస్యాత్మక గ్రామాలైన ముగడ, కోటిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీవో, ఈఆర్‌వో సాయిశ్రీ మంగళవారం సందర్శించారు. ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు ఆయా కేంద్రాల్లో ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. పోలింగ్ నాటికి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని ఏఆర్‌వో రాజారావు, ఎంసీసీ అధికారి ఆంజనేయులుకు తెలిపారు.